పారిశుద్ధ్యం..ఆందోళనకరం

- పేరుకు పోతున్న చెత్తకుప్పలు
- తొలగింపులో నిర్లక్ష్యం
- ఆందోళనలో స్థానికులు




గొల్లగూడెంలో రోడ్డుకు రెండువైపులా దర్శనమిస్తున్న చెత్త కుప్పలు.. కలెక్టరేట్ ఎదుట ఉన్న కాలనీలోని పార్కువద్ద దుస్థితి

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని వీధులలో చెత్త తొలగించేందుకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీధులలో ఎక్కడచూసినా రోడ్డుకు రెండు వైపులా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త పేరుకొని పోవడంతో పందులు, కుక్కలు యథేచ్ఛగా స్వైర్యవిహారం చేస్తున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధులలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలలో ఏర్పాటు చేసిన పార్కులు కూడా చెత్తతో నిండి పోవడంతో పిల్లల ఆడుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ యంత్రాంగం తూతూమంత్రంగా పనిచేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు కాలనీలలో రోడ్లపై చెత్త వేయడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. అంతేకాకుండా దోమలు విజృంభించడంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. జిల్లా కేంద్రమైన పట్టణంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే గ్రామాలలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే టోర్నమెంట్లు

జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: ప్రతిభను వెలుగులోకి తెచ్చుకునేందుకు క్రీడాటోర్నీలను వేదికలుగా ఉపయోగించుకోవాలని పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఉజ్వల్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ఎస్.ఉజ్వల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని బూచనెల్లిలో మండల స్థాయి, రంజోల్‌లో అర్బన్‌స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మండల, తాలుకా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్టుకు రూ.50వేలు, రన్నర్ జట్టుకు రూ.30వేలు నగదును, కప్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.జి.రాములు, జి.భాస్కర్, రామలింగారెడ్డి, జమీలుద్దీన్, నరేశ్‌గౌడ్, కండెం నర్సింహులు, రాజశేఖర్, తాహెరాబేగం, ప్రమోద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి..

ఝరాసంగం(జహీరాబాద్): క్రీడలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఉజ్వల్ రెడ్డి అన్నారు. ఝరాసంగంలో ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మండలాల వారీగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, లియాఖత్ అలీ, శ్రీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అన్సర్, షకీల్ అహ్మద్, రాజేందర్ సింగ్, నిర్వాహకులు రవుఫ్, మతిన్, ఫక్రుద్దీన్, ఇస్ రాహుల్, ఇస్మాయిల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఝరాసంగం(జహీరాబాద్): టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఉజ్వల్ రెడ్డి తదితరులు

క్లుప్తంగా

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ళ సంజీవరెడ్డి తెలిపారు. తన స్వగృహంలో 9 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఆపిన చెక్కులను అందజేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలులోకి తీసుకురాగా ఫిబ్రవరిలో మరో రెండింటిని అమలులోకి తీసుకురాబోతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ దారం శంకర్, చాప్టా(కె) సర్పంచ్ గంగయ్యస్వామి, మాజీ ఎంపీటీసీ ముంతాజ్, వినోద్‌పాటిల్, రాజు, పండరిరెడ్డి, ఆశమలీ తదితరులు పాల్గొన్నారు.

జాతరలతో భక్తిభావం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందిస్తాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెలలో నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం, జాతర మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జాతరను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, సుచరిత కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్ మల్లన్న జాతరలో

పటాన్ చెరు: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, సర్పంచ్ మల్లేశ్, సీనియర్ నాయకులు పట్నం రాజు, మాణిక్ యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా భూములను కాపాడాలి

ఎంబీ అలీఅక్బర్

జహీరాబాద్: కోహీర్ పట్టణంలో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, కందకాలను కాపాడాలని సామాజిక సేవకుడు, బజాజ్ ఇంజనీరింగ్ సంస్థ అధినేత ఎంబీ అలీ అక్బర్ కోరారు. ఆదివారం జహీరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామ కంఠానికి సంబంధించిన కందకాలు ఆక్రమణలకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కందకాలు నీటి ఊటలు పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. కందకం పక్కనే ఉన్న తనకు సంబంధించిన భూమిని సైతం కొందరు కాజేయాలని ప్రయత్నిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నా అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ విషయంలో న్యాయపరంగా పోరాటం చేస్తానన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారెడ్డి

పటాన్‌చెరు టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ప్రస్తుత ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి బదిలీపై పటాన్‌చెరు సీఐగా వెళ్లారు. సంగారెడ్డి డీటీసీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దాం

సీపీఎం జిల్లా నేత మాణిక్



మాట్లాడుతున్న మాణిక్

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మాణిక్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణఖేడ్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదేళ్లుగా కార్మికులు, కర్షకులపై అనేక భారాలను మోపుతూ కార్పొరేట్ పెద్దలకు లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. ఉపాధి, విద్య, వైద్యం, ఉద్యోగ కల్పనపై నిర్లక్ష్యాన్ని అవలంబిస్తూ నిత్యావసర సరకుల ధరలు పెంచి సామాన్యుల నడ్డివిరుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చేనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేవీపీఎస్, అంబేద్కర్ సంఘంతోపాటు పలు సంఘాల బాధ్యులు కాన్షీరాం, సంగమేశ్, ప్రవీష్, అశోక్, అరుణ్, రాజరత్నం, రాజశేఖర్, రాములు, ప్రకాశ్ పాల్గొన్నారు.

లాకౌట్‌ను వ్యతిరేకిస్తూ కార్మికుల ధర్నా



కార్మికులతో మాట్లాడుతున్న రాజయ్య

జిన్నారం(పటాన్‌చెరు): తమకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా యాజమాన్యం పరిశ్రమను లాకౌట్ విధించడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు ఆదివారం పరిశ్రమ ఎదుట ధర్నా చేపట్టారు. జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలోని మనాక్షియ పరిశ్రమ యాజమాన్యం లాకౌట్ విధించడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పరిశ్రమ నుంచి యంత్రాలను తరలిస్తుండడంతో కార్మికులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు యాజమాన్యం పరిశ్రమలోని యంత్రాలను తరలించొద్దని కార్మికులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య కార్మికులతో మాట్లాడారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు తాము పోరాటం చేస్తామని రాజయ్య హెచ్చరించారు.

బీటీ రహదారి నిర్మించాలి



న్యాల్‌కల్(జహీరాబాద్): మెటల్‌కుంటలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ నుంచి తాటిపల్లి వరకు బీటీ రోడ్డు పనులను సంబంధిత కాంట్రాక్టర్ ప్రారంభించారు. ఆదివారం కంకోల్ చౌరస్తా నుంచి మేళసంగ్యం, అంతారం గ్రామ శివారు వరకు బీటీ రోడ్డు(డాంబర్) వన్‌సైడ్ వేయనున్నారు. ఇదే మాదిరిగా తాటిపల్లి, పెద్దలోడి, పిల్లోడి, మక్తక్యాసారం, గార్లపల్లి, చీలపల్లి గ్రామాలకు రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. పిల్లోడి, బోడపల్లి గ్రామాల డబ్బవాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులను కూడా పూర్తిచేసి బోడపల్లి, చిన్నచల్మెడ మీదుగా ఖమ్మంపల్లి, మునిపల్లి చౌరస్తా వరకు బీటీ రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణీకులు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.7లక్షలు జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. ఆ పనులను ఆదివారం సర్పంచ్ పీటర్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు ప్రవీణ్, ఇసాక్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కారుడికి ఎంపీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

సంగారెడ్డి: తెలంగాణ ఉద్యమం నాటి నుంచి దాదాపు 24 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో క్రియాశీలకంగా ఉద్యమం నిర్వహించిన ఉద్యమకారుడు బీరయ్య యాదవ్ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని బీసీ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంగారెడ్డిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తగొల్ల మల్లేశ్‌యాదవ్ మాట్లాడారు. బీరయ్యకు అవకాశం కల్పిస్తే ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు అఖిల్, రఘు, శేఖర్ పాల్గొన్నారు.

యువత అవకాశాలు వినియోగించుకోవాలి



విజేతలకు నగదు, జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకే టోర్నీలు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బసంత్‌పూర్ గ్రామంలో ఈనెల 17న ప్రారంభించిన బీఎస్ఆర్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. విన్నర్ జట్టుకు రూ.20వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్బాస్, లాలప్ప, ఇస్మాయిల్, జీవన్, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదనరెడ్డి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

సంగారెడ్డి: కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి సూచించారు. మునిసిపాలిటీ పరిధిలోని ఇళ్లలో పనిచేస్తున్న గృహ కార్మికులకు నాయకత్వ లక్షణాలు, గృహహింస, కార్మిక హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి వారి సమస్యలను తమ సమస్యలుగా భావించి స్పందించాలని, అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డొమెస్టిక్ వర్కర్స్, నాయకులు, మెడ్వాన్ కోఆర్డినేటర్ స్వప్న, పార్కర్ కోఆర్డినేటర్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి చెప్పారు. స్థానిక మెట్రో స్వచ్ఛంద కార్యాలయంలో ఆదివారం ఆయన ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని బడికిరాని పిల్లలను తిరిగివచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నటరాజన్, మెడ్వాన్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



జిన్నారం(పటాన్‌చెరు): ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



వట్‌పల్లి(అందోల్): ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జిన్నారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సోలక్‌పల్లి గ్రామంలో కలుసుకొన్నారు. అప్పటి ఉపాధ్యాయులు అనంతరెడ్డి, కృష్ణారెడ్డి, శర్మను ఘనంగా సత్కరించారు. అలాగే వట్‌పల్లి మండల పరిధిలోని మర్వెళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు సందడి చేశారు. దాదాపుగా మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారంతా తమ జ్ఞాపకాలను పంచుకొన్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. హెచ్‌ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు బస్వశేఖర్, పండరయ్య, రాంరెడ్డి, అజిత్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు) / వట్‌పల్లి(అందోల్)

సంక్షిప్త వార్తలు

◆ బసవన్న బోధనలు ఆచరణీయం



జహీరాబాద్ టౌన్: బసవేశ్వరుడి బోధనలు ఆచరణీయమని కర్నాటకలోని బెంగళూరుకు చెందిన జనస్నేహ సంఘం నిర్వాహకుడు శామలింగ అన్నారు. స్థానిక అనుభ మండపంలో ఆదివారం నిర్వహించిన గురుబసవ ప్రార్థన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంటరానితనం నిర్మూలనకు బసవన్న కృషి చేశారన్నారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు రాజశేఖర్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్: మండలంలోని హుక్రాన(జి) గ్రామానికి చెందిన దాదాపు 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సోదరుడైన మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కాంగ్రెస్ కండువాలువేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

◆ బిచ్కుంద పీఠాధిపతిని కలిసిన జైపాల్‌రెడ్డి

జహీరాబాద్: బీజేపీ పార్లమెంట్ నాయకుడు ఎం.జైపాల్‌రెడ్డి ఆదివారం బిచ్కుంద పీఠాధిపతి సోమయప్పను మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామిజీని సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం జుక్కల్ నియోజకవర్గంలోని బండాయప్ప మఠాన్ని సందర్శించారు.



◆ గౌడ సంఘం అధ్యక్షుడిగా నరేందర్



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గౌడసంఘం అధ్యక్షుడుగా నరేందర్‌గౌడ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడితోపాటు పలువురిని ఎన్నుకున్నారు.

◆ నేడు ప్రత్యేక పూజలు



పటాన్‌చెరు టౌన్: రుద్రారం గణేశ్ గడ్డ దేవస్థానంలో సోమవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. అనంతరం నిత్య అన్నదానం ఉంటుందని జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్ రెడ్డి, ఈశ్వర్ తెలిపారు. అలాగే టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు మహేశ్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

◆ భక్తి మార్గాన్ని అనుసరించాలి

జహీరాబాద్ టౌన్: ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని అనుసరించాలని హరేరామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

◆ క్వారీపై కేసు

పటాన్‌చెరు టౌన్: అనుమతి లేకుండా పేలుళ్లు నిర్వహిస్తున్న క్వారీపై కేసు నమోదుచేసి ఆరుగురుని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మండలంలోని లక్డారం గ్రామ పరిధిలో ఉన్న సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ క్వారీలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో అనుమతి లేకుండా పేలుళ్లు చేపడుతున్నారని గుర్తించారు. దీనితో ఆర్డీవో ఆదేశాలతో ఆదివారం కేసు నమోదు చేసి ఆరుగురుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, పేలుళ్లకు ఉపయోగించే సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం లింగమయ్య కాలనీకి చెందిన అశోక్(27) అతడి స్నేహితుడి స్కూటీని తీసుకొని గత 21న బయటకు వెళ్లాడు. తిరిగి లింగమయ్య కాలనీకి వస్తుండగా ఎన్ఎస్ఎల్ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన అశోక్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ ఆధ్యాత్మిక భావనతో మెలగాలి



కంది(సంగారెడ్డి): ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో మెలగాలని రంగంపేట్ ఆశ్రమ పీఠాధిపతి మాదవానంద సరస్వతీస్వామి పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని చిమ్నాపూర్లో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హనుమాన్ ఆలయంవద్ద ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే, రాధాకృష్ణ పంతులు తదితరులు పాల్గొన్నారు.

◆ మానసిక స్థితి సరిగాలేక..

పటాన్‌చెరు టౌన్: మానసిక స్థితి సరిగా లేని మహిళ చెరువులో పడి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సెంతల్ గ్రీన్ పార్క్‌కు చెందిన నాగలక్ష్మి(62) భర్త 2019లో చనిపోగా అప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేక ఇబ్బంది పడుతోంది. రోజూ మాదిరిగానే ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా సాయిబాబా గుడి సమీపంలోని చెరువులో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం తెలుసుకొన్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ నర్సింగ్ ఆఫీసర్‌గా అఖిల

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ స్టేట్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఫలితాల్లో జోన్ మూడు ఓపెన్ కేటగిరీల్లో నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్‌నర్స్)గా మండల కేంద్రానికి చెందిన ఇమాంపురం వెంకటేశ్‌గౌడ్, విజయ దంపతుల కూతురు అఖిల ఆదివారం నియామకమయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.